ఊరూరా సిమెంటు రోడ్లు!

- నియోజకవర్గంలో రూ.70.35 కోట్లు కేటాయింపు
- 1.875 రోడ్ల పనులు ప్రారంభం


తంబళ్లపల్లెలోని ఓ వీధిలో నిర్మించిన సిమెంటు రోడ్డు

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గంలో పల్లెలకు సిమెంటు రోడ్ల పనులు ఊపందుకొన్నాయి. వీధుల్లో నడిచేందుకు సరైన దారుల్లేక ప్రజలు పడుతున్న కష్టాలను కళ్లారా చూసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి.. ప్రతి పల్లెకు సిమెంటు రోడ్లు వేయించి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నారు. ఈ మేరకు సిమెంటు రోడ్లు మంజూరు చేయించడంతో.. పనులు సాగుతున్నాయి. తమ పల్లెకు సిమెంటు రోడ్డు వేయించండి అంటూ గత ప్రభుత్వంలో ప్రజలు వేడుకొన్నా పట్టించుకోలేదు. ప్రస్తుతం పల్లెల్లో సిమెంటు రోడ్లు మంజూరై పనులు ప్రారంభం కావడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

581 రోడ్ల పనులు పూర్తి

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సిమెంటు రోడ్లు అవసరమైన పల్లెలను గుర్తించారు. వీటికి రూ.70.35 కోట్ల వ్యయంతో 1,875 రోడ్లను నిర్మించేందుకు అనుమతులు వచ్చాయి. భౌగోళికంగా నియోజకవర్గంలో పెద్ద మండలమైన పెద్దతిప్పసముద్రానికి అధిక రోడ్లు కేటాయించారు. దశాబ్దాలుగా ఈ మండలంలోని కొన్ని పల్లెలను గత పాలకులు పట్టించుకోకపోవడంతో నిర్లక్ష్యంతో మగ్గాయి. ప్రస్తుతం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పల్లెల దుస్థితి గుర్తించి అభివృద్ధి దిశగా పరుగులు తీయించేందుకు కృషి చేస్తున్నారు. కాగా కొన్ని చోట్ల మిగిలి ఉన్న రోడ్ల పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం అవుతున్నాయి. పనులన్నీ పూర్తయ్యాక పల్లెలు సిమెంటు రోడ్లతో కళకళలాడనున్నాయి. రూ.70.35 కోట్లతో 223.11 కిలోమీటర్లతో 1,875 రోడ్ల పనులు చేపట్టారు. ఇందులో ఇప్పటి వరకు 581 పనులకు చెందిన 64.65 కిలోమీటర్ల సిమెంటు రోడ్ల పనులు పూర్తయ్యాయి. మిగిలిన 158.46 కిలోమీటర్ల సిమెంటు రోడ్ల పనులు సాగుతున్నాయి.

సిమెంటు రోడ్ల మంజూరు వివరాలు

మండలం	పనులు విలువ	(రూ.కోట్లలో)
బి.కొత్తకోట	204	9.42
పెద్దతిప్పసముద్రం	433	16.99
తంబళ్లపల్లె	259	13.73
కురబలకోట	194	8.81
పెద్దమండ్యం	424	9.63
ములకలచెరువు	361	11.76

అభివృద్ధికి పెద్దపీట



తంబళ్లపల్లె అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జరగని అభివృద్ధి, సంక్షేమం 2019 నుంచి జరుగుతోంది. ప్రతిపల్లెకు తారురోడ్లు వేశాం, కాలిబాటలను రహదారులుగా తీర్చిదిద్దాం. వీధుల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసం సిమెంటు రోడ్ల నిర్మాణం చేయిస్తున్నాం.

– పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎమ్మెల్యే, తంబళ్లపల్లె

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే చింతల



తాడేపల్లిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీలేరు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించినట్లు ఎమ్మెల్యే చింతల తెలిపారు. - వాల్మీకిపురం

బాధ్యతగా విధులు నిర్వర్తించండి

పెద్దతిప్పసముద్రం : మండలంలో పని చేస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు లబ్ధిదారులకు అందేలా చూడాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి పనుల తనిఖీ


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మడుమూరు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. పని ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు ఉన్నాయా అని ఆయన ఆరా తీశారు. ప్రధానంగా పని చేస్తున్న కూలీల సంఖ్య, మస్టర్‌లో ఉన్న కూలీల వివరాలను క్షుణంగా పరిశీలించారు. ఉపాధి హామీ పనుల ద్వారా కూలీల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

9న మండల సమావేశం

వాల్మీకిపురం : స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఈ నెల 9న ఉదయం 10 గంటలకు ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో షబ్బీర్ అహ్మద్ తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఆయన కోరారు.

అందరికీ ఆరోగ్యం అందించడమే లక్ష్యం


వైద్యశిబిరాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ ఉషశ్రీ

పీలేరు : అందరికీ ఆరోగ్యం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నట్లు జిల్లా టీకాల నిర్వహణ అధికారి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. మంగళవారం తలపుల పీహెచ్‌సీ పరిధిలోని బోడుమల్లువారిపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో మొత్తం 405 మందికి చికిత్స నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శివయ్య, డాక్టర్ శ్రీదివ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అండగా నిలుస్తాం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి

మదనపల్లె సిటీ : నాయీ బ్రాహ్మణులకు అండగా నిలుస్తామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక దేశాయ్ ఫంక్షన్ హాలులో నాయీ బ్రాహ్మణ సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసిన ఘనత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జన్నే రాజేంద్రనాయుడు, నాయీ బ్రాహ్మణ సంఘ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు సుబ్రమణ్యం, రాష్ట్ర కార్యదర్శి సుబ్రమణ్యం, ప్రచార కార్యదర్శి వెంకటస్వామి, ఆవుల విశ్వనాథ తదితరులు పాల్గొన్నారు.

కెరీర్‌పై అవగాహన ఉండాలి


విద్యార్థులకు బుక్‌లెట్ అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

నిమ్మనపల్లె : విద్యార్థులు ఉన్నత చదువులు, కెరీర్‌పై అవగాహన కలిగి ఉండాలని వే ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ పైడి అంకయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముష్టూరు కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు ఉన్నత చదువులు, కెరీర్ గైడెన్స్‌పై వే ఫౌండేషన్, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కళాశాల ప్రత్యేక అధికారి ముని వెంకటమ్మతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగం పొందడంలో వెనకబడుతున్న విద్యార్థులను ప్రోత్సహించడానికి సంస్థల ఆధ్వర్యంలో కళాశాలలు, పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా గత ఏడాది తిరుపతి జిల్లాలోని సుమారు 11,930 విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాల, కస్తూర్బా పాఠశాల, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, గిరిజన సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సంకల్పం గట్టిగా ఉంటే ఏదైనా సాధించవచ్చునని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మార్గదర్శి బుక్‌లెట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా కళాశాల ప్రిన్సిపల్ మునివెంకటమ్మ, సిరివెల్ల బాషా, మునిలక్ష్మమ్మ, గీత తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయండి


ఆరోగ్య సిబ్బందికి సర్వే రికార్డులు, ఆరోగ్య కిట్లు అందజేస్తున్న డాక్టర్ జవహర్‌బాబు

కలకడ : మండలంలోని అందరూ చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు(ఆల్‌బెండజోల్), పల్స్‌పోలియో చుక్కలు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశా డే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9న జరగబోయే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు మధ్యాహ్నం భోజనానంతరం మింగించాలని సిబ్బందికి సూచించారు. పల్స్‌పోలియో కార్యక్రమంలో సైతం అందరూ ప్రజాప్రతినిధులను ఆహ్వానించి వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఆశా సిబ్బందికి ప్రభుత్వం నుంచి అందిన యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జవహర్‌బాబు, ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, పీహెచ్‌ఎన్ సుబ్బరత్నమ్మ, సూపర్‌వైజర్‌లు వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మ, సిబ్బంది ఇమ్రాయిల్, షరీఫ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎంపీడీఓల నియామకం

బి.కొత్తకోట : ఎన్నికల బదిలీల్లో భాగంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో పని చేస్తున్న ఎంపీడీఓలను బదిలీ చేయగా.. వారి స్థానాల్లో కొత్త ఎంపీడీఓలను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ జిల్లా నుంచి బి.కొత్తకోటకు ఎస్.నూర్జహాన్, పెద్దమండ్యంకు సి.వెంకటరమణయ్య, తంబళ్లపల్లెకు జి.కృష్ణమూర్తి, కురబలకోటకు ఎ.హరినారాయణ, పెద్దతిప్పసముద్రంకు జె.బ్రహ్మానందరెడ్డిలను నియమించారు. వీరు ఈ మండలాల్లో బాధ్యతలను చేపట్టనున్నారు.

తంబళ్లపల్లె ఎంపీడీవోగా కృష్ణమూర్తి



తంబళ్లపల్లె : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవోగా కృష్ణమూర్తి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన వైఎస్సార్ కడప జిల్లా పులివెందల నియోజకవర్గం సింహాద్రిపురం ఎంపీడీవోగా పని చేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

పెద్దమండ్యం ఎంపీడీవోగా వెంకటరమణయ్య



పెద్దమండ్యం : పెద్దమండ్యం ఎంపీడీవోగా వెంకటరమణయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈవోఆర్డీగా పని చేస్తూ, ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీధర్‌రావును తిరిగి ఈవోఆర్డీగా నియమించారు. వైఎస్సార్ కడప జిల్లాలోని పెద్దముడియం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణయ్యను పెద్దమండ్యంకు బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు.

పెద్దతిప్పసముద్రం ఎంపీడీవోగా బ్రహ్మానందరెడ్డి

పెద్దతిప్పసముద్రం : ఎన్నికల బదిలీల్లో భాగంగా పెద్దతిప్పసముద్రం మండల అభివృద్ధి అధికారిగా జె.బ్రహ్మానందరెడ్డిని నియమిస్తూ జెడ్పీ సీఈఓ కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు అందాయి. ఈయన గతంలో గుర్రంకొండ మండలంలో ఈవోఆర్డీగా పని చేసేవారు. ఇన్నాళ్లూ ఇక్కడ ఏవోగా ఉన్న గిరిధర్‌రెడ్డి ఎంపీడీవోగా పని చేసే వారు.

ఎన్నికల స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాట్లపై పర్యవేక్షణ

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా 164- మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లకు సంబంధించి ఆర్డీఓ హరిప్రసాద్ పరిశీలించారు. పాఠశాలలో చేయాల్సిన ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, తహసీల్దార్ కె.రమాదేవికి సూచనలిచ్చారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు భద్రపరిచే స్ట్రాంగ్‌రూములు, రూట్ మ్యాప్ తదితరాలపై చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు మూడంచెల భద్రత తదితర అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. దీనిపై ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందించి, వారి నిర్ణయం మేరకు నడుచుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ అస్లాం, ఆర్‌ఐ రెడ్డెప్ప, మున్సిపల్ సర్వేయర్ పూర్ణచంద్ర, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్ మహబూబ్‌బాషా

పీలేరు రూరల్ : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ మహబూబ్‌బాషా మంగళవారం పరిశీలించారు. ఎంసీపాలెం, కావలిపల్లె, ముడుపులవేముల, తలపుల, మేళ్లచెరువు, జాండ్ల, గూడరేవుపల్లె, బోడుమల్లువారిపల్లె పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 72 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. మంగళవారం 14 పోలింగ్ కేంద్రాలు తనిఖీ చేసినట్లు చెప్పారు. అన్ని కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ సుబ్రమణ్యం, ఆర్‌ఐ చాణక్య, వీఆర్‌వో శాంతకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీహరిరావు

బి.కొత్తకోట : మండలంలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న పక్కా గృహాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డీఈ శ్రీహరిరావు అన్నారు. మంగళవారం స్థానిక గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణాలపై చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఇంటి పునాదులకు రూ.20 వేలు, పైకప్పునకు రూ.10 వేలు అడ్వాన్సుగా చెల్లించడం జరిగిందని అన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయించి బిల్లులు అప్‌లోడ్ చేస్తే బిల్లులు మంజూరవుతాయని చెప్పారు. ఇచ్చిన లక్ష్యాల మేరకు గృహ నిర్మాణాలను పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈలు లావణ్య, సరోజ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ జట్టుకు ఆర్థిక సాయం


జట్టు సభ్యులకు నగదు అందిస్తున్న నాయకులు

గుర్రంకొండ : ‘ఆడుదాం ఆంధ్రా’ క్రికెట్ జిల్లా జట్టుకు రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ఇటీవల రాయచోటిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో గుర్రంకొండకు చెందిన క్రికెట్ జట్టు జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ జట్టు జిల్లా తరఫున ఈ నెల 9 నుంచి విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొననుంది. ఈ నేపథ్యంలో క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం వారికి రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి రూ.50 వేల ఆర్థికసాయం ప్రకటించారు. మంగళవారం స్థానిక గోల్డెన్ ప్లాజా కల్యాణ మండపంలో హరీష్‌రెడ్డి తరఫున జెడ్పీటీసీ సమీన్ ముక్తియార్, ఉపసర్పంచ్ కొండేటి మురళీసుమలతలు క్రికెట్ జట్టు కెప్టెన్ జావీద్‌లాల, వైస్ కెప్టెన్ నాసిర్‌లతోపాటు జట్టు సభ్యులకు ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడంలో హరీష్‌రెడ్డి ఎప్పుడూ ముందుంటారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా పేరు నిలబెట్టాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో హౌస్‌ఫెడ్ కార్యదర్శి గయాజ్ అహ్మద్, నాయకులు రజాక్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సారా రహిత సమాజానికి కృషి చేయాలి


సింగంవారిపల్లెలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి

గుర్రంకొండ : సారా రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌ఐ నాగార్జున రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సింగంవారిపల్లె, నడిమికండ్రిగ గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సారా తయారీ వృత్తిగా జీవించేవాళ్లు ఆ జీవితానికి స్వస్తి పలకాలన్నారు. వ్యవసాయం, పాడిపరిశ్రమ, గొర్రెలు పెంపకం వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం బ్యాంకుల్లో రుణాలు కుడా ఇస్తున్నారని అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణంలో ప్రజలు జీవించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొంటామన్నారు.

హంద్రీనీవా కాలువ లీకేజీని అరికట్టండి


రహదారిపై ధర్నా చేస్తున్న ప్రజలు

మదనపల్లె : హంద్రీనీవా కాలువలో లీకేజీ కారణంగా కృష్ణా జలాలు రోడ్డుపై వృథాగా ప్రవహించడమే కాకుండా, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు మంగళవారం జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు నెల రోజులకు పైగా హంద్రీనీవా కాలువ నుంచి నీరు లీకేజీ అవుతూ, బసినికొండ మెకానిక్ షెడ్‌ల గుండా చిత్తూరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తోందన్నారు. నీటిప్రవాహంతో షెడ్‌ల చుట్టూ నీరు చేరడమే కాకుండా లారీ బాడీ బిల్డింగ్, ఇతర పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. కరెంట్ షాక్‌తో షెడ్‌లలో పనులు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు హంద్రీనీవా అధికారులను కలిసి, విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో రోడ్డెక్కి నిరసన తెలపాల్సి వచ్చిందన్నారు. హంద్రీనీవా అధికారులు తక్షణమే లీకేజీని అరికట్టి తమ ఇబ్బందులు తొలగించాలని వారు కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ శివలింగయ్య

మదనపల్లె సిటీ : నిత్యం విధి నిర్వహణలో ఉండే ఆర్టీసీ సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంవీఐ శివలింగయ్య అన్నారు. స్థానిక ఆర్టీసీ టూ డిపో కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆర్టీసీ సిబ్బందికి అమ్మ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమ్మ హాస్పిటల్ వైద్యులు ఎం.సి.సందీప్ మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బందికి ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ-2 డీఎం ఆర్‌సీ నిరంజన్, సీఐ గీత, ఎంఎఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎండీసీ ఛైర్‌పర్సన్‌కు అభినందనలు


షమీమ్‌అస్లామ్‌ను అభినందిస్తున్న కౌన్సిలర్లు

మదనపల్లె : ఏపీఎండీసీ ఛైర్‌పర్సన్‌గా రెండోసారి బాధ్యతలు చేపట్టిన గుండ్లూరి షమీమ్‌అస్లామ్‌ను మున్సిపల్ కౌన్సిలర్లు మంగళవారం అభినందించారు. ఎస్‌బీఆర్ లేఅవుట్‌లోని షమీమ్‌అస్లాం స్వగృహానికి మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజంలతో కలిసి వెళ్లిన కౌన్సిలర్‌లు దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో పార్టీకి విధేయురాలిగా ఉంటే పదవులు వాటంతట అవే వరిస్తాయనేందుకు షమీమ్‌అస్లామ్ మంచి ఉదాహరణ అని వారు అన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 2018లో కడప జిల్లా మహిళా కోఆర్డినేటర్‌గా పార్టీకి షమీమ్‌అస్లామ్ అందించిన సేవలు ఎనలేనివన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితురాలిగా ప్రత్యేక గుర్తింపు పొందిన షమీమ్‌అస్లామ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని అభినందనలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, బి.ఏ.ఖాజా, ఈశ్వర్‌నాయక్, రాజేష్, భాను, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్పాన్‌ఖాన్, బాలగంగాధరరెడ్డి, గుండ్లూరురఫీ, ఎల్‌ఐసీ.సుధాకర్, రాయల్‌రవీంద్ర, చరణ్, వినుతాభాయి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఏలను పార్టీలు నియమించుకోవాలి


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్

మదనపల్లె : ఎన్నికల్లో పాల్గొనే రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను త్వరగా నియమించుకోవాలని ఆర్డీఓ హరిప్రసాద్ సూచించారు. మంగళవారం సబ్ కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని పార్టీలే బీఎల్‌ఏలను నియమించాయని, మిగిలిన వారు పూర్తిస్థాయిలో నియమించుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలతో సమావేశాన్ని ప్రతి వారం నిర్వహించి, వారు కోరిన సమాచారాన్ని ఇస్తున్నామని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా జనవరి 22న తుది ఓటర్ల జాబితాను విడుదల చేశామన్నారు. దీనికి సంబంధించి వస్తున్న ఫిర్యాదులను కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7, 8 దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా చైతన్యం తెచ్చేలా బీఎల్వోలు కృషి చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, తహసీల్దార్ రమాదేవి, ఎలక్షన్ డీటీ అస్లాం, తపస్విని, వైఎస్సార్ సీపీ తరఫున మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, ఆప్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి


వెంకటరమణారెడ్డి(ఫైల్)

తంబళ్లపల్లె : మర్రిమాకులపల్లె మాజీ సర్పంచు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి(83) అనారోగ్యంతో మంగళవారం ఉదయం స్వగృహంలో మృతి చెందారు. ఆయన గతంలో మూడుసార్లు సర్పంచుగా కొనసాగి ప్రజల నుంచి మంచిపేరు తెచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకర్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు. అనంతరం వైఎస్సార్ సీపీలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి విజయానికి కృషి చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, టీచర్లు.. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.